



పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులుతో మాట్లాడుతున్న గవర్నర్

అందని డైట్ బడ్జెట్...

- చదికిల పడిన యునాని వైద్యం
- జిజిహెచ్‌లో యునాని ఆస్పత్రి ఏర్పాటు చేసినా కనిపించని రోగులు
- రోజుకు 30 నుంచి 40కి మించని ఒపి
- అస్తవ్యస్తంగా కర్నూలు, బనగానపల్లె, ఆదోనిలోని 10 పడకల ఆస్పత్రులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఆయుష్ విభాగంలో యునాని వైద్యం కీలకమైంది. ఆయుర్వేదంతో పాటు యునాని వైద్యం చాలా పురాతనమైనది. మొండి వ్యాధులను మటుమాయం చేసే శక్తి యునాని వైద్యానికి ఉంది. కర్నూలు నగరంలో డాక్టర్ అబ్దుల్ హక్ పేరు మీద యునాని వైద్యశాల చాలా ఏళ్ల క్రితం నుంచి ఉంది. ఈ వైద్యశాలలో ప్రత్యేకాడి యునాని వైద్యులు ఉత్తమ ప్రతిభ కనబరిచి డాక్టర్ పట్టా పొందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, బనగానపల్లె, ఆదోని పట్టణాల్లో 10 పడకలతో కూడిన యునాని ఆస్పత్రి ఉంది. మిగిలిన ప్రాంతాల్లో యునాని డిస్పెన్సరీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ప్రభుత్వాలు డైట్ బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడంతో 10 పడకల ఆస్పత్రులు అస్తవ్యస్తంగా మారాయి. రోగులు వ్యాధులను మాయించుకుని పూర్తిగా నయమయ్యే వరకు ఆస్పత్రిలో చేరి వైద్య చికిత్సలు పొందేవారు. ఆస్పత్రిలో చేరిన వారికి భోజన సదుపాయాలు కల్పించేవారు. ప్రభుత్వం డైట్ బడ్జెట్ మంజూరు చేయకపోవడంతో రోగులకు భోజన సౌకర్యాలు కల్పించడం ఇబ్బందిగా ఉంది. రోగులను ఆస్పత్రిలో అడ్మిషన్ చేసుకోకుండా కేవలం ఓపి అవుట్ పేషెంట్‌గానే వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. కాలక్రమేణ యునాని వైద్యం తీసుకునే ప్రజలు ఇంగ్లీష్ వైద్యం వైపు వెళ్తున్నారు. యునాని వైద్యంపై మంచి అవగాహన ఉన్న వారు ఆస్పత్రులకు వెళ్లారు. ఆ ప్రాంతాల్లో ఉన్న యునాని వైద్యశాలను ప్రభుత్వ వైద్యశాల ఆవరణకు తరలించారు. కర్నూలు నగరంలో వన్ టౌన్ ప్రాంతంలో ఉన్న యునాని వైద్యశాల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలలో రోజూ కేవలం 30 నుంచి 40 వరకు మాత్రమే ఒపి వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇదే ఆస్పత్రి వన్ టౌన్ గడియారం ఆస్పత్రి పరిధిలో ఉండి ఉంటే అక్కడే నివసించే ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వైద్య చికిత్సలు పొందే వారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు యునాని వైద్యశాల నిర్వహణపై తనిఖీలు, పరిశీలనలు చేసి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కర్నూలు పాత నగరంలో యునాని వైద్యశాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



డైట్ బడ్జెట్ రాకపోవడంతో ఖాళీగా ఉన్న పది పడకల యునాని ఆస్పత్రి



కర్నూలు జిజిహెచ్‌లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ యునాని వైద్యశాల

మందుల సరఫరా బాగుంది

- యునాని సీనియర్ వైద్యులు డాక్టర్ కె.శ్రీనివాసులు



యునాని ఆస్పత్రిలో సీనియర్ వైద్యులు, జూనియర్ వైద్యులతో పాటు 8 మంది సిబ్బంది ఉన్నారు. ఒక స్టాఫ్ నర్స్, ఒక కాంపౌండర్, ఇద్దరు ఎంఎన్ఓలు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్, ఒక వాచ్‌మెన్ ఉన్నారు. ఒక మేటీ, ఒక స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డైట్ బడ్జెట్ రాకపోవడంతో 10 పడకల ఆస్పత్రి నిర్వహణ చేయడం లేదు. రోగులకు అవసరమైన మందులు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఒళ్లు నొప్పులు, దగ్గు, ఆయాసం, మోషన్, నరాల బలహీనత, రక్తహీనత, పార్శ్వ నొప్పి వంటి జబ్బులకు మందులు అందుబాటులో ఉన్నాయి. డయాబెటిక్‌కు మాత్రం మందులు అందుబాటులో లేవు. దీర్ఘకాలిక రోగాలు బొల్లి, యుటిరిగో, సోరియాసిస్, చర్మవ్యాధులు వంటి వ్యాధులను నయం చేసేందుకు యునాని వైద్యంలో మంచి మందులు ఉన్నాయి..

ప్రభుత్వం డైట్ బడ్జెట్ విడుదల చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్



ఉమ్మడి జిల్లాలోని మూడు యునాని వైద్యశాలలకు డైట్ బడ్జెట్ ప్రభుత్వం విడుదల చేయాలి. డైట్ బడ్జెట్ లేకపోవడంతో యునాని వైద్యం తీసుకునే రోగులు ఆస్పత్రిలో చేరటానికి ఆయిష్టత చూపుతున్నారు. అధిక సంఖ్యలో యునాని వైద్యం పొందే ప్రజలు ఉన్న నివాస ప్రాంతాల్లో యునాని వైద్యశాలలను ఏర్పాటు చేయాలి. జిజిహెచ్‌లో యునాని వైద్యశాలను ఏర్పాటు చేయడం వల్ల మర్రి చెట్టు కింద ఆముదం మొక్క ఉన్న చందంగా ఉంటుంది. వెంటనే ప్రభుత్వ యునాని వైద్యశాలలను కర్నూలు పాతబస్తీలో ఏర్పాటు చేయాలి.

రాఘవేంద్రుని సన్నిధిలో గవర్నర్

-భారీ భద్రత మధ్య గౌరవ వందనం స్వీకారం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గురువారం దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం ఆవరణలో ఉన్న యోగీంద్ర సభామండపంలో గవర్నర్‌కు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహ అవార్డును ప్రదానం చేసి, మెమెంటో అందజేశారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న రాఘవేంద్రస్వామి పూర్వారాధనకు రావాలని శ్రీమఠం నుంచి ఆహ్వానం అందడంతో మంత్రాలయం చేరుకున్నారు. శ్రీమఠంలో జరుగుతున్న సప్త రాత్రోత్సవాలకు ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంత్రాలయం చేరుకున్నారు. భారీ పోలీసు భద్రత మధ్య శ్రీపద్మనాభ తీర్థ అతిథిగృహం చేరుకున్న ఆయనకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ మణిమంజరిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసు బెటాలియన్ గౌరవ వందనం చేయగా సెల్యూట్ చేసి స్వీకరించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

కర్నూలు కలెక్టరేట్ : గవర్నర్ అబ్దుల్ నజీర్ హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కర్నూలుకు రోడ్డు మార్గాన బయల్దేరి వచ్చారు. మధ్యాహ్నం 2.10 గంటలకు కర్నూలు పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. గవర్నర్‌కు జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఐజి సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్, నగర మేయర్ బివై.రామయ్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కార్పొరేటర్ గాజుల శ్వేతా రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 3.40 గంటలకు పోలీసు అతిథి గృహం నుంచి మంత్రాలయం బయల్దేరి వెళ్లారు.

గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డిఐజి, ఎస్పీ

కర్నూలు క్రైమ్ : మధ్యాహ్నం కర్నూలు బిక్యాంపులోని పోలీసు అతిథి గృహం చేరుకున్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ బిక్యాంపులోని పోలీసు అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గుర్తింపునకు నోచని 'కౌలు'

- రుణ అర్హత కార్డుల జారీలో జాప్యం

- కౌలు రైతులకు అందని ప్రయోజనాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కౌలు రైతులు కనీసం గుర్తింపునకు కూడా నోచుకోవడం లేదు. కౌలు రైతులకు అందించాల్సిన రుణ అర్హత కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు కౌలు రైతులకు అందడం లేదు...

వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. '2019 పంట సాగుదారు హక్కుచట్టం' తెచ్చి కౌలురైతులకు ప్రభుత్వ సాయం ఏ ఒక్కటీ అందకుండా చేసింది. దీంతో కౌలురైతులు వ్యవసాయ సాగులో తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు లక్షల మందికిపైగా కౌలురైతులు ఉమ్మడి జిల్లాలో ఉన్నారు. 2011 భూఅధీకృత సాగుదారుని హక్కు చట్టంతో కౌలు రైతులకు కొన్ని హక్కులు కల్పించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డు జారీచేసి బ్యాంకు రుణాల నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సాయం కౌలురైతులకు అందేలా చట్టంలో పేర్కొన్నారు. దీంతో అధికారులు కౌలుకార్డులు ఇవ్వకపోతే రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించి సాధించుకునేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2011 కౌలుచట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసేసింది. దాని స్థానంలో 2019 పంట సాగుదారు హక్కుచట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని అంగీకారం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సి(కౌలుకార్డు) ఇవ్వకూడదని తెలిపింది. సిసిఆర్‌సి కార్డు లేకుంటే బ్యాంకు రుణం నుంచి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసాతోపాటు చివరికి ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా కౌలురైతులకు లేకుండాపోయింది. కౌలుకార్డులు కూడా అరకొరగా మంజూరు చేస్తున్నారు. కార్డులు ఇచ్చినవారికి కూడా బ్యాంకు రుణాలుగాని ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

పట్టించుకునేవారేరీ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలు రైతులే చేస్తున్నారు. తమ భూములు కౌలుకిచ్చేసి భూయజమానులంతా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులకు అందించాల్సిన సాయం మాత్రం సాగుచేయని భూయజమానులకే ప్రభుత్వం అందిస్తోంది. నిబంధనల ప్రకారం పంటరుణం సాగుచేసే రైతుకు అందించాలి. భూయజమానికి పంటేతర రుణం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతు మిత్ర గ్రూపులకు అరకొరగా రుణాలిచ్చి అవే కౌలురైతులకిచ్చిన రుణాలుగా కాగితాల్లో చూపిస్తున్నారు.

ధరల నియంత్రణలో విఫలం

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమరభేరీ

- నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - హోళగుంద

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ విమర్శించారు. గురువారం స్థానిక బస్టాండ్‌లో 'సిపిఎం సమరభేరి' గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో, ధరలను అదుపు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గద్దెనెక్కినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేదలపై పన్నుల భారం మోపుతోందని మండిపడ్డారు. ఈ విధానాలను రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తోందని విమర్శించారు. హమాలీలు ఈడిగ రాముడు, పులి, వన్నూరు, ఉలిగయ్య, గురుప్రసాద్, కోనేరు వెంకటేష్, రాము, ఈరన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ వద్ద 'సిపిఎం సమరభేరి' గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు మాట్లాడారు. ఈనెల 4న గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల నాయకులు అగ్రహారం నరసింహులు, బి.కరుణాకర్, మహ్మద్, రాజు, రమేష్, కృష్ణ, స్వామి, భాస్కర్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్నలు స్థానిక నాయకులతో కలిసి 'సిపిఎం సమరభేరి' గోడపత్రికలను ఆవిష్కరించారు. సిపిఎం నాయకులు వెంకటేశులు, పామన్న, కాదరమ్మ, మాంతయ్య, ఈరన్న పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని ఐరన్‌గల్, జంపాపురం, సజ్జలగుండం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు పాల్గొన్నారు.



హోళగుందలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు



గోనెగండ్లలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు



కౌతాళంలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

జొన్నగిరిలో వజ్రం లభ్యం

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని జొన్నగిరి గ్రామంలో గురువారం ఒక రైతుకు అత్యంత విలువైన వజ్రం లభ్యమయింది. ఆ వజ్రాన్ని అదే గ్రామానికి చెందిన ఒక వ్యాపారి రు.50 వేలు, రెండు జతల బంగారు కమ్మలు ఇచ్చి కొన్నట్లు తెలిసింది. ఇక్కడ దొరుకుతున్న వజ్రాల విలువ తెలియని ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తక్కువ రేట్లకే వ్యాపారులు కొంటున్నారు. వర్షం పడితే జొన్నగిరి, పగిడిరాయి,బొళ్ళవానపల్లె, ఉప్పర్లపల్లె, ఎర్రగుడి, రాంపురం తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో అత్యంత విలువైన వజ్రాలు లభ్యమవుతున్నాయి. ఈ వజ్రాలను అనంతపురం జిల్లా గుత్తి, కర్నూలు జిల్లా మద్దికేర మండలం పెరవలి, తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ఇంత బహిరంగంగా జరుగుతున్న వజ్రాల వ్యాపారంను అటు రెవెన్యూ, ఇటు పోలీస్ శాఖ పట్టించుకోకపోవడం శోచనీయం.

ఉపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలో ఎంపీయుపిఎస్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రమణారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎన్ నాగేశ్వరరావు డిఈఓను కోరారు. గురువారం ఈ మేరకు డీఈవో వెంకట రంగారెడ్డిని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లాలో వడ్డేపల్లి మండలం శాంతినగర్లో ఐపీసీ 326, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో మహబూబ్నగర్ జైలుకు తరలించారని డిఈఓ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు రమణారెడ్డి రిమాండ్‌లో ఉన్నందున క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేయాలని విన్నవించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని 46వ వార్డ్ బృందావన్ అపార్ట్మెంట్స్, అశోక్ నగర్ 120వ సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగనన్న అందిస్తున్న వైఎస్‌ఆర్ చేయూతతో తమ భవిత మారుతోందంటూ అక్క చెల్లెమ్మలు తన ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్టాండింగ్ కమిటీ సభ్యులు, 46వ వార్డ్ కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, యూసుఫ్, భాస్కర్ రెడ్డి, మల్లి, హసీనా, ఆంజనేయులు, చందు, సురేష్, దావూద్, మౌలాలి, సజ్జద్, జహీర్, రషీద్, ఇంతియాజ్ ఖాతున్, సచివాలయం సిబ్బంది, వార్డ్ ముఖ్య నాయకులు, కన్వీనర్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

4న సమరభేరి ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అధిక ధరలు, నిరుద్యోగంపై సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 4న కర్నూలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రామాంజనేయులు కోరారు. నిత్యావసర సరుకులు, కరెంట్ బిల్లులు, ఇంటి, కులాయి పన్నులు, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, చెత్త పన్ను రద్దు చేసి, 400 రూపాయలకే గ్యాస్ ఇవ్వాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం కర్నూలు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగర కమిటీ సభ్యులు రంగస్వామి అధ్యక్షతన జొహరాపురంలో పై ఆటో స్టాండ్ దగ్గర సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం ఆధ్వర్యంలో జరిగే సమరభేరి ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ముగింపుగా 4వ తేదీ కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కమిటీ నాయకులు మైమూద్, దాసు, తిప్పన్న, నాగరాజు, కుమార్, సంసోన్, మాసుం, భరత్, మోహన్, మధు, కృష్ణ, మౌలాలి, జోసెఫ్ పాల్గొన్నారు. అలాగే నగరంలోని 15వ వార్డు బుధవారం పేటలో సిపిఎం నాయకులు ఎస్. సామెల్ అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, నగర కమిటీ సభ్యులు ఆర్ కృష్ణ మాట్లాడారు. నాయకులు జి. రమేష్ బాబు, బి.లక్ష్మన్న, రాముడు, బి.మద్దిలేటి, ఆర్. చంద్ర పాల్గొన్నారు. అలాగే పాతబస్తీలోని లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మండపం ముందు మద్దిలేటి అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్, నగర కమిటీ సభ్యులు మహబూబాషా, నాయకులు మత్తయ్య, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, ఎలీషా, రాజేంద్ర బాబు, మహబూబ్, గిడ్డయ్య, మునువార్ భాష, శాలి భాష, షేక్షావలి, ఏక్ బాల్, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** కర్నూలు నగరంలోని 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో వార్డు కార్యదర్శి ఎం.జమ్మన్న అధ్యక్షతన సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు మాట్లాడారు. నాయకులు రహిమాన్, గుర్రప్ప, ఖాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే 32వ వార్డులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఎం నాయకులు సిహెచ్ సాయి బాబా, సుధాకర్, ఎంసి ఆనంద్, దావీదు, దేవేంద్ర, మాదన్న, బి రాముడు, రామాంజనేయులు, సురేష్, శ్రీనివాసులు, ముక్తారు బి, రాజు, మద్దిలేటి, జె రాజు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **వెల్దుర్తి :** ఈ నెల 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్ కోరారు. వెల్దుర్తిలో సిపిఎం నాయకుల మారెన్న అధ్యక్షతన సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. దేవరాజు, గిడ్డయ్య, వెంకట రాముడు, రామాంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **తుగ్గలి :** తుగ్గలిలో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు కొండారెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు రంగస్వామి, రైతు సంఘం నాయకులు రంగరాజు, హమాలీ సంఘం నాయకులు, కార్మిక సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు. **కోడుమూరు :** కోడుమూరులోని పాత బస్టాండ్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు జిపి వీరన్న మాట్లాడారు. కార్యక్రమంలో గొర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిలేటి, సిఐటియు నాయకులు మధు పాల్గొన్నారు.



వీకర్ సెక్షన్ కాలనీలో సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు



కోడుమూరులో..



వెల్దురిలో..



పొలంబడి కార్యక్రమం చేపడుతున్న ఎఇఒ

కొండాపురంలో వరి పంటపై పొలంబడి

ప్రజాశక్తి - సి బెళగల్ : మండలంలోని కొండాపురంలో ఏఓ మల్లేష్ కుమార్ వరి పంటపై పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. పంటల సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక ఎరువుల, మందుల వాడకం తగదన్నారు. అధికారుల సలహాలు తప్పకుండా పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్దు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు హోటళ్లలో చోరీ

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి నేషనల్ హైవేలోని చెరుకులపాడు సర్కిల్లో ఉన్న మూడు హెూటల్లో బుధవారం రాత్రి కిటికీలు పగులగొట్టి దొంగలు చోరీ చేశారు. హెూటల్లో ఉన్న మిక్సీలు, గ్రైండర్లు, 20 వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. వెల్దుర్తి ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంత జీవనం గడపాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - కోడుమూరు : గ్రామాల్లో ప్రజలు ఎలాంటి గొడవలకు, అల్లర్లుకు వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని డిఎస్‌పి విజయ్ శేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని అమడగుంట్ల గ్రామాన్ని ఆయన సదర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో కోడుమూరు సిఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సి బెళగల్‌లో ధ్యానంపై ర్యాలీ

ప్రజాశక్తి - సి బెళగల్ : బెళగల్‌లో ధ్యానంపై ధ్యానాంధ్రులు పొలాసి వెంకటేష్, కంపాడు ఈరన్న బ్రదర్స్, బురాన్‌దొడ్డి సోమిరెడ్డి తదితరులు ర్యాలీ నిర్వహించారు. ఊరేగింపుగా వెళ్లి శ్వాసమీద ధ్యాసనే ధ్యానమని, ధాన్యం పాటించడం వలన ఆరోగ్యంగా ఉండగలమని, ప్రధానంగా శాఖహారంపై అవగాహన కల్పించారు. జీవహింస మానవత్వం కాదని తెలిపి రాజరాజేశ్వరి ఆలయంలో గంటపాటు చేపట్టిన ధ్యానంకు పలువురు అధికసంఖ్యలో పాల్గొనగా స్పందన లభించింది.

యువగళంకు సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం గౌరు దంపతుల స్వగృహం నుంచి నంద్యాల చెక్ పోస్ట్ సర్కిల్ వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ముఖ్య అతిధులుగా టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకట రెడ్డి, పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు, కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. అనంతరం టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సంఘీభావ పాదయాత్రలో గౌరు దంపతులు

ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

కర్నూలు నగరంలోని గాంధీ నగర్‌లో ఎపి సాంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం (బెస్త, తెలుగు, గంగపుత్ర) కర్నూలు నగర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కదిరి రమేష్ ఆధ్వర్యంలో గరువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి, బిపి, షుగర్, జ్వరం వ్యాధులకు మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఆనంద్ రాజు బాలు, ఉపాధ్యక్షులు జలగరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నాగ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, (108) ఈసీ నెంబర్ నన్నూరు రాజు, జాతీయ మత్స్యకార సంఘం కర్నూలు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ నాగశేషులు, షరీఫ్‌నగర్ భాస్కర్, యువజన నాయకులు గోపి, చందు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



పథకాలకు అర్హతే కొలమానం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్
- సచివాలయ కార్యాలయ ప్రారంభోత్సవం


లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న మంత్రి జయరామ్

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా, అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. గురువారం మండలంలోని ఏరూరు గ్రామంలో సర్పంచ్ తిమ్మాపురం వెంకటలక్ష్మి అధ్యక్షతన మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి జూటూరు హేమలత మారయ్య, వైసిపి కన్వీనర్ రంగస్వామి ఆధ్వర్యంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి గుమ్మనూరు జయరామ్, ఆలూరు ఇన్‌ఛార్జి నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు హాజరయ్యారు. గ్రామంలోకి అడుగు పెట్టగానే ప్రజలందరూ గుమ్మనూరు జయరామ్‌కు పూలవర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో మంత్రిని సన్మానించారు. రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించి గ్రామంలో అందుతున్న సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. రాలేని పథకాల గురించి కూడా అధికారుల చేత వాకబు చేసి తెలుసుకున్నారు. సచివాలయానికి స్థలం ఇచ్చిన చెరుకూరి చిన్న లక్ష్మన్న ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ఏరూరు గ్రామానికి రూ.7.63 కోట్లు వివిధ పథకాల ద్వారా అందాయన్నారు. గ్రామంలో డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు నిర్మించేందుకు రూ.25 లక్షల గ్రాంట్లు విడుదల చేస్తున్నామన్నారు. రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది కలుగకుండా బంటనహాల్ స్టేషన్ వరకు గ్రావెల్ రోడ్డు వేయించామని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో రిజర్వాయర్ పనులు పూర్తవుతాయని చెప్పారు. ఎవిసి కాలువకు నీరు వచ్చేటట్లుగా ప్రత్యేక తూము ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున, సర్పంచులు ప్రేమ్ కుమార్, నీలకంఠ, వైసిపి కో కన్వీనర్ హనుమన్న, విక్రాంత్ రెడ్డి, జూటూరు ధనుంజయ, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, బెల్గల్ గోవింద, శ్రీధర్, షేకన్న, బాబు, సతీష్, జయన్న, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ కొండయ్య, ఎవిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, పంచాయతీ కార్యదర్శి జయరాం నాయక్, విఆర్ఓ చంద్ర నాయక్, సిఐ వెంకటేశులు, ఎస్ఐ రమేష్ బాబు పాల్గొన్నారు.

వాగ్వాదంతో ముగిసిన మున్సిపల్ మీట్

- అభివృద్ధిపై వైసిపి, టిడిపి కౌన్సిలర్ల విమర్శలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


వాగ్వాదానికి దిగిన వైస్ ఛైర్మన్, టిడిపి కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం టిడిపి, వైసిపి కౌన్సిలర్ల వాగ్వాదంతో ముగిసింది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ ఛైర్మన్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి కౌన్సిలర్ దయాసాగర్ వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని చెప్పారు. దానికి వైసిపి కౌన్సిలర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ ధీటుగా సమాధానం ఇచ్చారు. టిడిపి కౌన్సిలర్ వార్డుల్లో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి చేశారో లెక్కలతో సహా చూపించడంతో పట్టణ అభివృద్ధిపై టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే ఇండోర్ స్టేడియం దగ్గర మున్సిపల్ స్థలాల్లో అక్రమంగా బంకులు వేసిన వారు మూడు రోజుల్లో తొలగించకపోతే అక్కడే కూర్చుని ధర్నా చేస్తామని టిడిపి కౌన్సిలర్లు తెలిపారు. ఇరువురికి మున్సిపల్ ఛైర్మన్ రఘు ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో ఛైర్మన్ బెల్ కొట్టి సమావేశాన్ని ముగించి బయటకు వెళ్లిపోయారు. అసలైన అజెండా పక్కదోవ పట్టింది.

వ్యాపార రంగంలో యువత భాగస్వామ్యం కావాలి

- వైసిపి నాయకులు జయమనోజ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న జయ మనోజ్ రెడ్డి

ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగంలో ప్రవేశించి యువత ఆర్థికాభివృద్ధి సాధించాలని వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి కోరారు గురువారం పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో వెంకటేష్ నెలకొల్పిన 'ఫేమస్ ఛాయ్' హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. వ్యాపార పరంగా జీవనోపాధి పొందుతూనే ఇతరులకు కూడా ఆర్థికంగా ఉపాధి కల్పించిన వారుగా ఉంటారన్నారు. వార్డు కౌన్సిలర్లు చలపతి, చిన్న, నాయకులు మధు, శేషిరెడ్డి ఉన్నారు.

పన్నుల వసూలు ఫుల్.. సౌకర్యాలు నిల్...

- చినుకు పడితే రోడ్లు గుంతలమయం... - సాయి గణేష్ కాలనీ వాసుల ఇక్కట్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో అధికారులు పన్నుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధ సౌకర్యాలపై చూపడం లేదు. పట్టణంలోని జిఎం పెట్రోలు బంకు వెనుక లైన్‌లో ఉండే సాయి గణేష్ కాలనీలో రోడ్లు గుంతలమయమై కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చాలు రోడ్లంతా బురదమయం, గుంతలమయం అవుతున్నాయి.

మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లలో ఫుల్ కలెక్షన్లు చేస్తున్నారు. సౌకర్యాల కల్పనలో మాత్రమ వెనుకంజ వేస్తున్నారని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లన్నీ జలమయం, బురదమయంగా మారుతున్నాయి. ఈ ప్రాంతంలో వర్షం వస్తే ఇంట్లో నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులుకు, అధికారులుకు కాలనీ వాసులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేరు. కాలనీవాసులు ప్రతేడాది ఇంటి పన్నులు తూచ తప్పకుండా చెల్లిస్తున్నారు. వసతుల కల్పనలో అధికారులు విఫలం చెందారు. నాలుగేళ్ల నుంచి కాలనీ వాసులందరూ కలిసి ప్రతి ఇంటికీ రూ.2500 వసూలు చేసి రోడ్డు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఇలా ఎన్నిసార్లు సొంత డబ్బులతో ఖర్చు పెట్టాలని, తాము కూడా పన్నులు కడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కొత్తగా ఇళ్లు కట్టేవారు, బిల్డర్స్ రూ.లక్షలు, రూ.కోట్లు పెట్టి బిల్డింగ్స్ కట్టిస్తున్నారని, వాటి నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని టస్కర్, లారీలు, టిప్పర్లు, జెసిబిలు వంటి భారీ వాహనాలతో తరలిస్తుండడంతో రోడ్లు మోకాళ్ల లోతు గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వచ్చి వెళ్తున్నారు. వేస్ట్ మట్టి కూడా పిడకెడు వేయడం లేదు. వారి పని కోసం రోడ్లను ఘోరంగా తయారు చేస్తున్నారు. కాలినడకన వెళ్లేవారికి, పాఠశాలకు పిల్లలు వెళ్లాలన్నా, ఆస్పత్రులకు వెళ్లేందుకు కూడా ఆటోలు కాలనీ లోపలికి రావడం లేదు. కాలనీ వాసులు పనుల నిమిత్తం బయటకు వెళ్ల లేని పరిస్థితి ఉంది. వీధి లైట్లు లేవు. డ్రెయినేజీ లేదు. రోడ్లు లేవు. తాగడానికి ఒక్క తాగునీటి కుళాయి కూడా లేదు. రాత్రయితే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఇంటికి చేరాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైె కాలనీలో కనీస వసతులు కల్పించాలని కాలనీ వాసులు ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు.



బురదమయమైన రోడ్లు

కనీస వసతులు కల్పించాలి

- సిపిఎం జిల్లా నాయకులు సి.గోవిందు



పట్టణంలోని సాయి గణేష్ కాలనీలో కనీస వసతులు కల్పించాలి. కాలనీ వాసులు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ వసతుల కల్పనలో అధికారులు విఫలం చెందుతున్నారు. పన్నులు చెల్లిస్తున్నప్పుడు కనీస అవసరాలు వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు కల్పించాల్సిన కనీస బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతాం.


విగ్రహావిష్కరణలో గుడిసె కృష్ణమ్మ

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోనిరూరల్


వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శనీయమని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ తెలిపారు. గురువారం మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమని నిరూపించిన మహానుభావుడు వాల్మీకి అని తెలిపారు. వాల్మీకి అడుగు జాడల్లో నడిచి జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మాజీ ఎంపిపి మురళీ, సాధిక్ వలీ, ఓంకార్, లింగన్న, పంపన్న గౌడ్, భరత్, ఈరేష్, చిన్నహరివాణం గ్రామ వాల్మీకి నాయకులు నాగరాజు, రాము, రాముడు, పి.నాగరాజు, వి.నాగరాజు, చిట్టి, హనుమంతు, సీనప్ప, అయ్యప్ప, ఎం.శివరాముడు, మూకప్ప, రామాంజి, హనుమంతు, దేవేంద్ర, నాగేష్, వీరేష్, మల్లికార్జున స్వామి, చంద్ర, వల్లూరు, నరసప్ప, కడుబూరు, హనుమంతు, లక్ష్మన్న, షేకన్న పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రుని పూర్వారాధన

- శ్రీమఠం చేరుకున్న పుణ్యక్షేత్రాల వస్త్ర ప్రసాదాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా పూర్వారాధనను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు వైభవంగా నిర్వహించారు. గురువారం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి, పంచామృతాభిషేకం, అభిషేకం, తులసి అర్చన వంటి పూజలు నిర్వహించారు. బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల సందర్భంగా పుణ్యక్షేత్రాలైన శ్రీరంగం రంగనాథుని ఆలయం, అహోబిలం, నరసింహస్వామి ఆలయం, ముల బాగల నుంచి స్వామివారికి శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలతో ఆలయాల అర్చకులు, పండితులు మంత్రాలయం చేరుకున్నారు. శ్రీమఠం ప్రధాన ఆర్చి వద్ద నుంచి పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ, భజన మండలి సభ్యుల భక్తి గీతాలతో భజంత్రీల వాయిద్యాల నడుమ శ్రీమఠం వరకు ఊరేగించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులుకు అప్పగించి రాఘవేంద్రస్వామికి సమర్పించారు. పీఠాధిప తులకు అలంకరించి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలతో పూలమాలలు వేసి నమస్కరించుకున్నారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆలయాల అర్చకులకు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. శ్రీమఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుజయీంద్ర తీర్థుల మనవలు సుధీంద్రాచార్, ధీరశ్రీ ఆచార్, ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి, ద్వారపాలకులు అనంతస్వామి, ప్రకాష్ రావు, సహాయక పిఆర్ఒ హోన్నొళ్లి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఠాధిపతులు

జాబ్‌ఛార్ట్ రాలేదు.. జీతాలు రాలేదు...

- జిల్లాలో ఎంఇఒ-2 అవస్థలు
- మార్గదర్శకాలు ఎప్పుడొస్తాయో

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వైసిపి ప్రభుత్వంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, మండలానికి ఇద్దరు ఎంఇఒగా ఉండాలని నిర్ణయంతో, ఆ దిశగా అడుగులు వేస్తూ మండలానికి ఇద్దరిని నియమించారు. వారు బాధ్యతలు చేపట్టి మూడు నెలలు గడుస్తున్నా, ఇంతవరకు జాబ్‌ఛార్ట్, జీతాలు రాలేదు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జీతభత్యాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. విధి నిర్వహణకు సంబంధించిన జాబ్‌ఛార్ట్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఇద్దరూ కలిసి పర్యవేక్షణ, తనిఖీలు చేస్తున్నారు. జీతభత్యాలు చెల్లించే డిడిఒ ఎవరో ఇప్పటికీ తెలియ రాలేదు.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

ప్రతి మండలానికీ ప్రభుత్వం రెండో ఎంఇఒను నియమించింది. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి ఉద్యోగోన్నతి కల్పించి జూన్‌లో ఎంఇఒ-2 నియామకాలు చేపట్టారు. ఎంఇఒ-2గా చేరిన వారికి ప్రత్యేక విధులు, బాధ్యతలు అప్పగిస్తామని ఉన్నతాధికారులు చెప్పడంతో చాలామంది ప్రధానోపాధ్యాయులు ఆసక్తిగా ముందుకొచ్చారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత విధులేమిటో తెలియక ఎంఇఒ-1 పక్కనే మరో కుర్చీలో కూర్చుని కాలం వెల్లదీస్తున్నారు. కొన్ని చోట్ల ఇద్దరూ కలిసి వెళ్తూ తూతూమంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు.



జీతం కోసం ఎదురుచూపులు

ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుకు డిడి అధికారం ఉండడంతో మిగిలిన ఉపాధ్యాయులతో పాటు వారి జీతం సొంతంగానే బిల్లులు పెట్టుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఎంఇఒ-2లకు జీతాలు ఎవరు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంఇఒ-1కు ఎంపిడిఒ జీతాల బిల్లులు పెడుతున్నారు. ఎంఇఒ-2కు ఎవరు డిడిఒగా వ్యవహరిస్తారో స్పష్టత లేదు. ఉద్యోగోన్నతి పొంది విధుల్లో చేరి మూడు నెలలు గడిచినా జీతభత్యాలు అందుకోలేకపోతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఎప్పుడొస్తాయో..?

ఎంఇఒ-2లకు సంబంధించి జాబ్‌ఛార్ట్, ఇతర మార్గదర్శకాలు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూపులు తప్పడం లేదు. సెప్టెంబర్ నెలలో జాబ్‌ఛార్ట్, ఇతర మార్గదర్శకాలు, జీతాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఎంఇఒ-2గా బాధ్యతలు చేపట్టిన కొందరు అధికారులు చెప్పారు.


సబ్ కలెక్టర్‌కు రాఖీ కడుతున్న నాయకులు

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి

- సబ్ కలెక్టర్‌కు రాఖీ కట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి పటిష్టంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీష కోరారు. గురువారం రక్షాబంధన్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహిళా నాయకులు శిరీష, కవిత, హసీనా బాను సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు, డీఎస్పీ శివ నారాయణ స్వామికి వారి కార్యాలయాల్లో రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలపై దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ పటిష్టంగా అమలు చేయకపోవడం వల్ల అమ్మాయిలపై అఘాయిత్యాలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలను గౌరవించాలని చెబుతున్నా ఆచరించడంలో సరైన ప్రాచుర్యం లేదని తెలిపారు. ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కలిసి రావాలి

- లతీఫ్ లౌబాలి దర్గా ఉప పీఠాధిపతి సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ అల్ హైదరి

ప్రజాశక్తి - ఆదోని

ముస్లింలు హక్కుల సాధనకు కలిసి రావాలని కర్నూలులో వెలసిన లతీఫ్ లౌబాలి దర్గా ఉప పీఠాధిపతి సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ అల్ హైదరి కోరారు. ఈనెల కర్నూలులో నిర్వహిస్తున్న 'చలో కర్నూలు', ముస్లిం లా బోర్డు సమావేశానికి సన్నాహకంగా గురువారం పట్టణంలోని ఎస్ఎంబి తాజ్ ఫంక్షన్ హాలులో ఆదోని ముస్లిం, మైనారిటీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లిం లా బోర్డు సమావేశం రాష్ట్ర విభజన తర్వాత మొదటిసారిగా కర్నూలులో ఈనెల 3న బహిరంగ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలిండియా ముస్లిం లా బోర్డు అధ్యక్షులు మౌలానా ఖలిద్ సైపుల్లా జానీ హైదరి ఆధ్వర్యంలో కర్నూలు మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ పాత కంట్రోల్ రూమ్ వద్ద జరిగే సదస్సుకు తరలి రావాలని కోరారు. హాలే హై దిస్ జమాత్ ప్రతినిధి ఆఫీజ్ మంజూర్ సాబ్, నోబుల్ సర్వీస్ సొసైటీ కర్నూలు ఉపాధ్యక్షులు మౌలానా మహ్మద్ సాధిక్, రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా పాషా, కర్నూలు ప్రభుత్వ ఖాజీ ముఫ్తీ షా వలీ అల్లా, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు నియాజ్ అహ్మద్, ఆదోని ప్రభుత్వ ఖాజీ అల్తాఫ్ హుస్సేన్, ఆదోని ఖతిబ్ సాబ్ జునైద్ హాష్మి, ముఫ్తీ ఆసిపుద్దీన్, ప్రముఖ నాయకులు జమీల్ షఫీ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్లు హందు, ఆర్‌టిసి రహిమాన్, పెద్ద మసీదు కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మహబూబ్ బాషా, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అల్తాఫ్ ఉన్నారు.

ఉచిత గుండె, కంటి ఆపరేషన్ల శిబిరం

- నాగేష్ కాకుబాళ్

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలోని శక్తి గుడి వద్ద శ్రీజిహ్వేశ్వర పాఠశాలలో ఈనెల 3న ఉచిత గుండె, కంటి పరీక్షల శిబిరం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఆర్ఐ నాగేష్ కాకుబాళ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. గుండెకు సంబంధించిన ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్ కొలెస్ట్రాల్, టిజిఎల్, హెచ్‌డిఎల్, విడిఎల్, ఈసీజీ, టుడిఎకో, టిఎంటి పరీక్షలు డాక్టర్ల సలహా మేరకు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో నిర్వహిస్తామని చెప్పారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో గతంలో కూడా వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. సంతానం లేని వారికి ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై వైసిపి నిర్లక్ష్యం : సిపిఐ

ప్రజాశక్తి-ఆలూరు

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సిపిఐ జిల్లా నాయకులు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే బస్సుయాత్రను జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గ వేదవతి, నగరడోన రిజర్వాయర్లు పూర్తి చేయాలని 2న ఆలూరుకు వస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. 2న జరిగే వేదవతి ప్రాజెక్టు గర్జన సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. **ఆస్పరి** మండలంలోని యటకల్లు, చొక్కనహళ్లి, తురువగల్లు, తొగలగళ్ళు, తంగరడోన, ములుగుందం, డి.కోటకొండ, బైలు పత్తికొండ గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో జీపుజాతా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సిపిఐ సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, అంజినయ్య, బ్రహ్మయ్య, రంగన్న పాల్గొన్నారు.

రాఘవేంద్ర అనుగ్రహ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ప్రముఖులకు రాఘవేంద్ర అనుగ్రహ అవార్డులను ప్రదానం చేశారు. గురువారం రాఘవేంద్రస్వామి పూర్వారాధన సందర్భంగా శ్రీమఠం ఆవరణలోని యోగీంద్ర సభామండపంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డులు అందజేశారు. టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్, విద్వాన్ శ్రీరామ విఠలాచార్య, ప్రముఖ అవధాని డాక్టర్ గరికపాటి నరసింహ మూర్తి, డాక్టర్ విశ్వనాథ్ కరాడ్, జస్టిస్ శ్రీషానంద, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మెమొంటోతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడారు. విశ్వ గురువు రాఘవేంద్ర స్వామి, పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో రోజురోజుకు మంత్రాలయం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని తెలిపారు. శ్రీమఠం అధికారులు సుధీంద్రాచార్, ధీరశ్రీ ఆచార్, ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ద్వారపాలకులు అనంతస్వామి, ప్రకాష్ రావు పాల్గొన్నారు.



అవార్డు ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న గరికపాటి నరసింహమూర్తి

ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తాం...

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి
- 'యువగళం'సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - కోసిగి

తుంగభద్ర హోస్పేట్ డ్యాం నుంచి దిగువకు 2 టిఎంసిల నీరు నదిలోకి విడుదల చేయించాలని, లేకపోతే జిల్లాలో ఉన్న వైసిపి ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి హెచ్చరించారు. గురువారం యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పాదయాత్రకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండలంలోని చింతకుంట గ్రామం నుంచి కోసిగిలోని రేణుక ఎల్లమాంబ దేవాలయం వరకు 5 కిలోమీటర్లు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులు ఆగిపోతే ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. వైసిపి నాయకుల చేస్తున్న ఇసుక అక్రమాలను ప్రశ్నిస్తే తప్పా అని నిలదీశారు. 'మీకెక్కడ అనుమతులు ఉన్నాయి. ఉంటే పోలీసులకు చూపించమనండి. రెవెన్యూ అధికారులకు చూపించండి. మీకు ఇచ్చిన అనుమతి ఎప్పుడో అయిపోయింది. ఇప్పుడు మీరు రోజుకు 200 లారీల్లో దొంగ ఇసుక అమ్ముకుంటున్నార'ని విమర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, శివబాల, రమాకాంత్ రెడ్డి, లారీ అయ్యన్న, జ్ఞానేశ్, భరద్వాజ్ శెట్టి, వక్రాణి వెంకటేశులు, నాడిగేని రంగన్న, వీరారెడ్డి, పంపాపతి, అడివప్ప గౌడ్, చెన్న బసప్ప, ఐ టిడిపి నాయకులు సల్మాన్ రాజు పాల్గొన్నారు. **ఆదోని**లో సంఘీభావ యాత్ర చేపట్టారు. మీనాక్షి నాయుడు స్వగృహం నుంచి మొదలైన పాదయాత్ర ఎమ్మిగనూరు రోడ్డులో నిర్మల్ థియేటర్, ఎన్‌టి.రామారావు విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి వైసిపి నాయకుల్లో వణుకు పుడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ లోకేష్ పాదయాత్ర దిగ్విజయంగా సాగుతోందని తెలిపారు. రాజకీయంగా ప్రభంజనం సృష్టిస్తూ, అవరోధాలు ఎదురైనా దాటుకొని ద్విగ్విజయంగా, నిర్విరామంగా 200 రోజులు, 2700 కిలో మీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకున్నారని కొనియాడారు. పట్టణంలో భారీ ర్యాలీగా అంబేద్కర్ నగర్ వద్ద అంబేద్కర్, అటు నుంచి ఎన్‌టిఆర్ విగ్రహాలకు చేరుకొని పూలమాల వేసి 3 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ఆదోని అబ్జర్వర్ ఆదెన్న మాట్లాడుతూ... జగన్‌కు ఎందుకు ఓటు వేశామా అని రాష్ట్ర ప్రజలు మదన పడుతున్నారని తెలిపారు. టిడిపికి ఎప్పుడు ఓటు వేద్దామా అని ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. టిడిపి జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు అప్సర బాష, బసాపురం రామస్వామి, హనువాలు మాబాష, అయ్యన్న, బసవ, మదిరే వీరేష్, కృష్ణారెడ్డి, రంగస్వామి నాయుడు, వీరేష్, మల్లికార్జున, స్వామినాథ, బాబు నాయుడు, ప్రతాప్, వెంకటేష్, మహిళా నాయకులు సాధికా బేగం, రాయనగర్ కుమారి, శాంతి, అరేకల్ రామకృష్ణ, హరిఫ్, ఫొటో వెంకటేష్, చాగి మల్లికార్జున, సాదాపురం వీరేష్ ఉన్నారు. అలాగే పట్టణంలో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. సౌదీ రావుఫ్, మాన్వి దేవేంద్రప్ప కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ ఇంట్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. **గోనెగండ్ల**లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. గోనెగండ్లలోని విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి గంజిహళ్లి రోడ్డు, బస్టాండ్, స్టేట్ బ్యాంకు, ఎస్సీ కాలనీ మీదుగా, గాజులదిన్నె ప్రాజెక్టు రోడ్డు వరకు 3 కిలోమీటర్లు ర్యాలీ సాగింది. సర్పంచి హైమావతితో కలిసి కేక్ కట్ చేశారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, బేతాళ బడేసాహెబ్, తిరుపతయ్య నాయుడు, రామాంజనేయులు, శ్రీధర్ నాయుడు, టి.రమేష్ నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా ఫక్రుద్దీన్, రంగస్వామి నాయుడు, నూర్ అహ్మద్, జయపాల్ పాల్గొన్నారు. **దేవనకొండ** క్రాస్ రోడ్డు నుంచి టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు దేవనకొండ ఎన్‌టిఆర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, మాలిక్ బాష, రామారావు నాయుడు, మల్లయ్య, ఉచ్చీరప్ప, ఆకుల వీరేష్, వెంకటస్వామి గౌడ్, రాజశేఖర్ గౌడ్, బండ్లయ్య, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజా సాబ్, పెద్దయ్య, మస్తాన్, సుభాన్, చాంద్ బాషా పాల్గొన్నారు. **ఆస్పరి**లో సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు తిమ్మన్న, రామచంద్ర రెడ్డి, నారాయణ, తెలుగు యూత్ కన్వీనర్ రాఘవేంద్ర, సతీష్, నాగన్న, రామాంజనేయులు, మహేష్, చిదానంద, అక్బర్ పాల్గొన్నారు.


దేవనకొండలో మాట్లాడుతున్న సుజాతమ్మ


కోసిగిలో సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



ఆదోనిలో సంఘీభావ యాత్రలో మీనాక్షి నాయుడు


గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు